
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 135 వ భాగం

## సూర్య వంశం – 3; శర్యాతి

సూర్య వంశంలో కొంత కధ ఇలా కొడుకులూ మనుమలతో సాగింది. అందులో కొంతమంది మామూలుగా రాజ్యం చేసినా వాళ్ళగురించి పెద్దగా చెప్పుకోవడానికేమీ లేదు కధలో. భాగవతం విష్ణులీలలు చెప్పేది కనక వాళ్లని వదిలేసి ముందుకి సాగుదాం. దీనికి కారణం కూడా సులభం తెలుసుకోవడం. ఎవరెవరు ఎలా రాజ్యాలు ఎంతకాలం చేసారనేదానికన్నా వారం రోజుల్లో చనిపోబోయే పరీక్షిత్తుకి భగవంతుణ్ణి గురించి వినడం ముఖ్యం కదా? అందువల్ల ఈ స్కంధంలో తర్వాత వాడైన శర్యాతి కధ చెప్తున్నాడు ఇప్పుడు శుకమహర్షి పరీక్షిత్తుకి.

సీ. శర్యాతి యను రాజు జనియించె బ్రహ్మప
రుండైన మనువుకు రూఢితోడ;
నతఁ డంగిరుని సత్రమందు రెండవనాఁటి
విహితకర్మము లెల్ల వెలయఁ జెప్పె;
నతని కూఁతురు సుకన్యక యను వనజాక్షి
దన తండ్రితోఁ దపోవనికి నరిగి,
చ్యవనాశ్రమముఁ జేరి, సఖులును దానును
ఫలపుష్పములు గోయఁ బాఱి, తిరిగి [9-51]

ఆ. యొక్కపుట్టలోన నొప్పారు జ్యోతుల
రెంటిఁ గాంచి, వాఁడి ముంటఁ బొడిచెఁ;
గన్య ముగుద మఱచి, ఖద్యోతయుగ మంచు,
దైవవశముకతనఁ దమకి యగుచు. [9-51.1]

బ్రహ్మజ్ఞాని (లేదా బ్రహ్మపరుండు – బ్రహ్మాన్ని తెలుసుకున్నవాడు) అయిన మనువుకు శర్యాతి అనే రాజు పుట్టాడు. ఈయన అంగిరుని యజ్ఞములో (సత్రమందు) రెండవ దినం చేయవలసిన కర్మకాండ అంతటిని నిశ్చయించి, చక్కగా వివరించి చెప్పాడు. ఆయనకో కూతురు సుకన్యక. తండ్రితో చ్యవనునుడనే ముని ఆశ్రమానికి వెళ్ళాక అక్కడ చెలికత్తెలుతో కలిసి పూలు, పండ్లు కోయడానికివెళ్ళి ఏదో ఒక పుట్టలో చక్కగా ప్రకాశిస్తున్న రెండు జ్యోతులు కనిపిస్తే, మిణుగురు పురుగుల జంట (ఖద్యోతయుగము) అంటూ, సూదిగా ఉన్న ముల్లుతో పొడిచింది. ఎందుకలా చేసిందంటే దైవ నిర్ణయం అని చెప్పుకోవాల్సిందే. దైవ నిర్ణయం అని ఎందుకన్నాడంటే, దీనివల్ల జరిగే మంచి ముందు తెలుస్తుంది.

క. జ్యోతుల ముంటం బొడిచిన,
వాతుల నెత్తురులు గురిసె, వసుధేశభట
వ్రాతముల కెల్ల నచ్చట,
నా తఱి మలమూత్రబంధమయ్యె; నరేంద్రా! [9-52]

ఇలా పొడవగానే రక్తధారలు కురిసాయి. రాజభటులకి (వసుధేశం – రాజ్యం) అక్కడ మిగతావారికీ మలమూత్రాలు స్థంభించాయి. కొన్ని పనులకి ఫలితం వెంటనే రావొచ్చు. కొన్నింటికి సమయం పడుతుంది కానీ ఏ చెడ్డ/మంచి పని చేసినా ఫలితం వచ్చి తీరుతుంది; దాన్ని అనుభవించవల్సిందే.

వ. వారలంజూచి, రాజర్షి యగు శర్యాతి విస్మితుండై, "మీర లియ్యాశ్రమ దూషణంబు చేయనోపుదు; రది కారణంబుగా మీకీ నిరోధంబు సిద్ధించె" నని పలుకు నవసరంబునఁ దండ్రికి సుకన్యక యిట్లనియె. [9-53]

ఇదంతా రాజర్షి అయిన శర్యాతి చూసి తన భటులతో అన్నాడు. మీరు ఈ ఆశ్రమంలో ఏదో అపరాధం చేసి ఉంటారు అందుకే ఇలా అయింది. ఈ సరికి సుకన్యకి తెలిసి వచ్చింది. ఆవిడ తాను చేసిన తప్పు వప్పుకుంటూ చెప్తోంది తండ్రితో.

తే. అయ్య! యీ పుట్టచేరువ నాడి యాడి,
యిందులో రెండు జ్యోతుల నేను గాంచి,
కంటకంబునఁ బొడువ రక్తంబు గురిసె,
నే విధంబునఁ గురిసెనో? యెఱుఁగు మీవు. [9-54]

నేను ఈ పుట్టలో కనిపించే జ్యోతులు మిణిగురు పురుగులనుకుని పొడిచాను పుల్లతో. అలా చేయడం వల్ల రక్తం కారి వీళ్ళకి ఇలా మలమూత్రాలు బంధనానికి కారణం అయిందేమో నువ్వు చూడాలి.

వ. అనిన శర్యాతి భీతుండై కూఁతుం దోడ్కొని, వల్మీకంబు కడకుం జని, యందుఁ దపంబు జేయుచున్న చ్యవనునిం గని, తన నేర్పున నతని వలనఁ బ్రసన్నత పడసి తపసి చిత్తంబు నెఱింగి, తన పుత్రిక నిచ్చి, యెట్టకేలకుం బ్రదికినవాఁడై, మునీశ్వరుని వీడ్కొని, పురంబునకుం జనియె; నంత. [9-55]

ఈ మాట విని శర్యాతి వణికిపోయాడు. పుట్టలో తపస్సు చేసే చ్యవనుడి దగ్గిరకి వచ్చి అనేక రకాలుగా ప్రసన్నుణ్ణి చేసుకుంటే ఏం తెల్సింది? కళ్ళు పోయాయి కనక సేవచేయడానికెవరో ఉండాలి కూడా. అందువల్ల ఈ సుకన్యనే చేసుకుంటే మంచిది అనుకున్నాడు కాబోలు. అలా రాజు ఈవిడని చ్యవనుడికి ఇచ్చి పెళ్ళి చేసి ముని ఆగ్రహం నుంచి తప్పించుకున్నాడు. మలమూత్ర బంధనాలనుంచి రాజ భటులూ మిగతావారూ తప్పించుకున్నారు కూడా.

ఆ. పరమకోపుఁ డయిన భార్గవుఁ బతిఁ జేరి
మిగులఁ బనుల యెడల మెచ్చఁ దిరిగి
యతని పర్ణశాల నా సుకన్యక యను
మగువ గొన్ని యేండ్లు మనువు మనియె. [9-56]

ఈ ముని పరమకోపిష్టివాడు. కానీ తప్పు చేసింది ఈవిడే కనక నోరెత్తకుండా చెప్పిన పనులు చేస్తూ ఈ ముని పర్ణశాలలో కొన్నేళ్ళు గడిపింది. ఆయన మనసులో ఏముందో మనకి ప్రస్తుతం తెలియదు. ఆవిడ తప్పు చేసింది సరే కానీ తన ముసలితనం వల్ల ఆవిడ జీవితం పోతోంది కదా?

వ. అంత నొకనాఁ డయ్యాశ్రమంబునకు వేల్పువెజ్జులైన నాసత్యు లిద్దఱు వచ్చిన వారలం బూజించి, తన ముదిమి జూపి, చ్యవనుం డిట్లనియె "మీకు మున్ను యాగభాగంబుల లేని సోమపానంబు నేఁడు గల్పించి యిచ్చెద; సోమపాన సమయంబునఁ బానపాత్రంబు మీకు నందిచ్చెద, నా ముదిమి మానుపుం" దని యిట్లనియె.

[9-57]

ఇలా ఉన్నప్పుడు చ్యవనుడి దగ్గిరకి ఆరోగ్యానికి మూలపురుషులగా చెప్పబడే ఆశ్వినీ దేవతలు వచ్చారు. చ్యవనుడు వారితో అంటున్నాడు "ఇంతకుముందు మీకు యజ్ఞాలలో యాగభాగం లేక సోమపానం చేసే అధికారం ఉండేది కాదు. నా ముసలితనం (ముదిమి) పోగొట్టారంటే నేను మీకు సోమపానం చేసే అధికారం కల్పిస్తాను." దీనికి కారణం కూడా చెప్తున్నాడు.

క. నవకంబగు ప్రాయంబున
జవరాండ్రఁ గరంచు మేని చక్కఁదనంబున్
శివతరముగఁ గృప జేయుఁడు
దివిజాధిప వైద్యులార! దీవింతు మిమున్. [9-58]

నవ యవ్వనంలో ఉండేటట్టు అందంతో మంగళకరం అయ్యేటట్టు చేయండి; మిమ్మల్ని దీవించి సోమపానం చేసే అర్హత కల్పిస్తాను. వీళ్ళనే ఎందుకు అడుగుతున్నాడంటే వీళ్ళు అన్నీ తెల్సిన వైద్యులు – దివిజాధిప వైద్యులు. ఈ పద్యంలో మంగళకరం అనేది – శివతరము అనే పదం తో చెప్పాడు. ఇదే పదం మనం నమకంలో చూడవచ్చు – నమః శివాయచ (మంగళకరుడు), శివతరాయచ (ఇంతకంటే మంగళకరుడెవరూ లేరు) అంటూ. మరోసారి ఆలోచిస్తే ఈయనకి సుకన్య ఎంత సేవచేస్తోందో చూసాడు. కానీ లోపల పాపం ఈవిడ

జీవితం నా ముసలితనం వల్ల ఇలా అయిందే ఏం చేయాలా అని మధన పడుతున్నాడు కనక ఈ దేవతలని అడిగాడు ముసలితనం పోగొట్టమని.

వ. అనిన నశ్వినిదేవతలు సంతోషించి "సిద్ధనిర్మితంబయిన యీ మడుఁగున మునుఁగు" మని పలికి.

[9-59]

అడగ్గానే అన్నీ ఇచ్చేయడం కుదరదు. తీసుకునేవారికి అర్హత ఉండాలి. చ్యవనుడికి అర్హత ఉన్నా వాళ్ళావిడకి ఉందా? ఆవిడ ఇన్నాళ్ళు నిజంగా భార్యలా సేవ చేసిందా లేకపోతే 'తప్పదురా బాబూ' అనుకుంటూ చేసిందా అనేది తెలుసుకోవాలి. అందువల్ల 'సరే ఈ సిద్ధ నిర్మితమైన మడుగులో మునుగు' అని చ్యవనుణ్ణి తీసుకెళ్ళారు ఓ మునక వేయించడానికి.

సీ. ముసలితాపసుఁ బట్టి, మొగి నెత్తుకొనిపోయి
ముగురు నా మడుఁగున మునిఁగి లేచి,
వనితాజనుల నెల్ల వలపించువారలై-
సుందర మూర్తులై, సుభగు లగుచుఁ,
గమలమాలికలతోఁ, గనకకుండలముల
తోఁ, మంచిచీరలతోడఁ దుల్యు
లై సూర్యతేజస్కులై యున్నవారల
మువ్వురఁ బొడగాంచి, ముగుద బాల [9-60]

తే. యిందుఁ బెనిమిటి వీఁ డని యెఱుఁగ లేక
గరిత గావున నిజనాథుఁ గానఁ గోరి
"సుభగమతులార! నా నాథుఁ జూపుఁ" డనుచు
నశ్విదేవతల కపు డ య్యబల మ్రొక్కె. [9-60.1]

ఇలా ఆయనని తీసుకెళ్ళి ముగ్గురూ మునిగి లేచేసరికి ముమ్మూర్తులా ఒకే రూపుతో ఉన్న ముగ్గురు బయటకొచ్చారు. వీళ్ళు సూర్య తేజస్సుతో సుందరమూర్తులుగా మనోహరంగా (సుభగులు) ఉన్నారు. అయితే

సుకన్యకి వీళ్ళలో తన భర్త ఎవరో తెలియలేదు. కళ్ళతో చూసి చెప్పగలిగితే ఇంకేం? అసలే అటువైపు ఉన్నవారు దేవతలు. అందువల్ల మీ ముగ్గురిలో నా భర్త ఎవరో నాకు తెలియడం లేదు. మీరే చూపించండి అని అడిగింది ఆశ్వినీ దేవతలని.

వ. వార లా పతివ్రత నిజమరితనంబునకు మెచ్చి, వయోరూపసంపన్నుం డయిన చ్యవనుం జూపి, దంపతుల వీడ్కొని, విమానారూఢులై వేలుపుల ప్రోలికిం జని రంత. [9-61]

ఆవిడ శీలానికి మెచ్చుకుని 'ఇదిగో ఈయనే మీ భర్త' అని చ్యవనుణ్ణి చూపించి విమానం మీద స్వర్గానికి వెళ్ళారు. అప్పటికి ఈ చ్యవన మహర్షి వయోరూప సంపన్నుడై ఉన్నాడు. ఈ వచనంలో వేలుపులప్రోలు అంటే? వేలుపులు – దేవతలు; ప్రోలు – పట్టణం లేదా ఉండే చోటు – స్వర్గం.

చ్యవనుడికి అశ్వినీదేవతలు ముసలితనం పోగొట్టారు కనక ఇంక మిగిలినది మరో యజ్ఞం చేసి లేదా యాగంలో రెండోరోజు కర్మకాండ అంతా బాగా తెలిసిన వాడైన శర్యాతి చేత చేయించి, అశ్వినీ దేవతలకి మాట ఇచ్చినట్టూ సోమపానం అర్హత కల్పించడం. ఇది చ్యవనుడేవిధంగా చేస్తాడో వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS